# జడ్జిమెంట్

అది మామూలు రోజు కాదు.

ఓ ప్రత్యేకమైన రోజు.

ముప్పయ్యవ వసంతంలోకి అడుగు పెడుతూన్న రోజు. తన పుట్టినరోజు!

అందుకే సరోజ అద్దంముందు అంత సేపు నుంచుంది. ఎంత సేపు నుంచున్నా అలంకరణ సంతృప్తికరంగా పూర్తికాలేదు. సిగలో పువ్వులు మరో సారి సర్దుకుంది. అటు తిరిగి ఓమారూ ఇటు తిరిగి ఓమారూ తన అందమైన రూపాన్ని తనివితీరా చూసుకుంది. బొట్టు సరిజేసుకుంది. ఇంకోమారు పౌడరు అద్దుకుంది. కొత్తచీర అంచులు అలవోకగా సర్దుకుంది. తోటలో జామిచెట్టు మీదికి జేరిన చిలుకలు కలకలం చెయ్యసాగాయి. మామిడి చిగుళ్లు తింటూ మధ్యమధ్య కోకిల కూస్తోంది. మధురమైన ఆ శబ్దాలకి సరోజ మనస్సు ఉల్లాసంగా ఊగింది. కళ్లు అరమోడ్పులయ్యాయి. గుండెల్లో కులుకు కంఠంలో కూని రాగంగా కదిలింది.

ఇలా కూనిరాగం తీస్తూ, చీర అంచులు సర్దుకుంటూ, వేనిటీ బేగ్‌ని విలాసంగా ఊపుకుంటూ తను కారు లోంచి దిగితే, మొత్తం మహిళామండలి అంతా తన చుట్టూ చేరడం, కొందరు తన చీరనీ, మరికొందరు తన కారు కలర్‌నీ, కొంతమంది తన అందాన్ని పొగుడుతూంటే, తను అలవోకగా నవ్వడం, "మన సరోజకి ముప్పైయేళ్ళంటే ఎవరూ నమ్మరు. వయస్సు ఎంత వచ్చినా ముఖంలో కాంతీ కళా, శరీరంలో మెరుపూ, రవ్వంతయినా తగ్గలేదు. ఇరవై ఏళ్ళంటే ఇట్టే నమ్ముతారు—"

అని అందరూ అభినందిస్తూంటే, వాళ్ళందరికీ కూల్‌డ్రింక్స్ పార్టీ ఇచ్చి, నవ్వుతూ హాయిగా గంటో గంటన్నరో గడిపితే ఏం హాయి! ఏం థ్రిల్!

ఇలా తియ్యగా ఆలోచిస్తూ మేడమీద గదిలోంచి కిటికీగుండా, కింద పోర్టికో వైపు చూసింది సరోజ.

పోర్టికోలో కారు లేదు.

వెల్‌వెట్ క్లాత్‌తో డ్రైవరు తుడుస్తూంటే, తళతళ మెరిసిపోతూ, పోర్టికోల్లో, రాజహంసలా నిలబడి ఉండగా తను ఇందాకే కదా చూసింది- అద్దం దగ్గరికి వెళ్ళకముందు, అలంకరణ ప్రారంభించకముందు- అరగంట క్రితం అయి ఉంటుంది. ఇంతలోనే ఏమైపోయింది?!

"రత్తీ!" సరోజ కేకకి మేడంతా మార్మ్రోగింది.

"పోర్టికోలో కారు ఏదీ? ఎవరు వేసుకెళ్ళారు?" సరోజ గొంతులో తీవ్రతని గమనించి, రత్తి ఏం మాట్లాడకుండా నేలచూపులు చూస్తూ ఉండిపోయింది.

"ఏం మాట్లాడవేం?"

"మరండీ....మరి...పెద్దమ్మగారండి....గుడికెళ్ళి ఇప్పుడే వస్తానంటూ...."

"ఏవిటీ? నేను మహిళామండలికి వెళ్ళాలనుకుంటూంటే, సరిగ్గా ఆవిడకి కూడా ఈ సమయంలోనే కారు కావలసి వచ్చిందా?....గుడికి అంత తొందరైతే, మా పుట్టింటివారిచ్చిన కారే కనిపించిందీ? వాళ్ళ అబ్బాయి కారులో వెళ్ళొచ్చుగా?"

"ఆ డ్రైవరు ఇయాల రాలేదండి."

"మరి జడ్జిగారు కోర్టుకెలా వెళ్ళారు?"

"టేక్సీలోనండి...."

"ఆ... ఏవిటి? టేక్సీలోనా?... అబ్బబ్బ! ఈయనకి వయసు వస్తున్న కొద్దీ వివేకం వెనక్కి వెళుతున్నట్లుంది. సబ్‌జడ్జి అంటే దర్జాగా ఎలా ఉండాలి? కోర్టుకి టేక్సీలో వెళ్ళడమా?.... రామరామ....ఊ... చివరికి ఆయన టేక్సీలోనూ, నేను రిక్షాలోనూ, ఆవిడమాత్రం హుందాగా కారులలోనూ....బాగుంది....చాలా బాగుంది...."

సరోజ ఇలా చిందులు తొక్కుతూన్న సమయంలో కారువచ్చి పోర్టికోలో ఆగింది.

కొబ్బరిచెక్కా అరటిపళ్ళూ దేవుడి నిర్మాల్యం పువ్వులూ ఉన్న వెండి సజ్జ పుచ్చుకొని, కట్టుకున్న పట్టుచీర గరగరమంటూంటే ఎర్రగా వెలిగిపోతూన్న కుంకంబొట్టుతో పార్వతీదేవిలా కలకల్లాడుతూ కారుదిగింది సుందరమ్మ.

కోడలు సరోజని చూస్తూనే, "అమ్మాయ్! దేవుడి ప్రసాదం ఇదిగో, కళ్ళకద్దుకొని నోట్లో వేసుకో!" అంది.

కాని, సరోజ ఆమాట వినిపించనట్లు విసురుగా వెళ్ళి సుందరమ్మ దిగిన కారులోకి ఎక్కి కూర్చుని, డోర్ ధన్‌మని వేస్తూ డ్రైవరుతో ''మహిళామండలికి'' అని చెప్పింది.

వెళ్ళిపోతూన్న కారుకేసి నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడి ఉండిపోయింది సుందరమ్మ....

రాత్రి భోజనాల దగ్గర....

''అమ్మా! నీ కోడలు అలిగిందేవిటీ? ఏమైనా ఘర్షణ పడ్డారా?''— నవ్వుతూ అడిగాడు రాజా సుందరమ్మని.

భర్త రఘురామయ్యకీ, కొడుకు రాజాకీ, మనుమలు శశికీ శివుడికీ, వంటావిడ చేతిలోంచి అందుకొని, కొసరి కొసరి ఆప్యాయంగా వడ్డిస్తూన్న సుందరమ్మ, కొడుకు మాటలు విని మొదట తెల్లబోయింది; తర్వాత దూరంగా నుంచుని ఎటో చూస్తూన్న కోడలికేసి చూసింది.

''ఊఁ....''అని గట్టిగా నిట్టూర్చి, తర్వాత మాట్లాడుకుందాం అని కొడుక్కి కళ్ళతో సంజ్ఞ చేసింది.

పైకప్పు ఎగిరిపోయేలా గట్టిగా పాఠాలు చదివి చదివి అలిసిపోయి శశి నిద్రపోయింది. శివుడు కూడా హోమ్‌వర్క్ పూర్తిచేసి, రేడియోలో పాటలు వింటూ వింటూ, నిద్రలోకి జారుకొన్నాడు.

ఇంట్లో పెద్దలు రఘురామయ్య సుందరమ్మా, రాజా సరోజా హాల్లో సమావేశమయ్యారు....

''ఊఁ....ఈ మారు చెప్పరా?....నా కోడలు అలిగిందా?'' నవ్వుతూ అడిగింది సుందరమ్మ.

"దాని సింగారం ఇప్పుడప్పుడే పూర్తి అయిందా? ఈలోగా గుడికివెళ్ళి వచ్చేయవచ్చు అన్నావా డ్రైవర్‌తో?'' బోనులో నుంచున్న ముద్దాయిని అడిగినట్లు అడిగాడు రాజా.

"అని డ్రైవరుతో ఎందుకంటాను? నాలో నేను అనుకున్నాను" అంది సుందరమ్మ....అని అంతటితో ఊరుకోలేదు.... "ఏదో చిన్న విషయానికి ఇంత రాద్ధాంతమా?" అంది.

"ఆ....మీకు చిన్నవిషయంగానే ఉంటుంది....నేను బాధపడ్డాను. దాన్ని రాద్ధాంతం అంటారేవిటి? ఆ మాట నాకు నచ్చలేదు"— ఉక్రోషంగా అంది సరోజ.

"సోసీ... కారు తీసికెళుతున్నదానివి కాస్త చెప్పి తీసికెళ్ళకపోయావా అమ్మా?'' అన్నాడు రాజు, భార్య వాదనకి వీలుగా.

''ఏవిటీ? దాని అనుమతి తీసుకునా? భార్యపట్ల ఎంత పక్షపాతం ఉన్నా న్యాయం చెప్తున్నపుడు నిష్పక్షపాతంగా చెప్పాలిరా! కోర్టులో తీర్పులు కూడా ఇలాగే చెప్తున్నావా?" అంటూ తల్లి హోదాలో మందలించింది సుందరమ్మ.

రాజు పకపక నవ్వి, ''అది కాదమ్మా....ఆ కారు సరోజది కదా—వాళ్ళ పుట్టింటివారు ఇచ్చింది. దాని కారు మనం వాడుకొనేటప్పుడు....''

''అగు.... సరోజ నా కోడలు అవునా? నా కోడలే నాది అయినప్పుడు దాని పిల్లలూ, దాని వస్తువులూ, దాని కారూ అన్నీ నావి కావా?.... కావని చెప్పమను'' అంది సుందరమ్మ గంభీరంగా ముఖం పెట్టి.

అత్తగారి ఆప్యాయతకి సరోజ మనస్సు ఆనందంతో నిండిపోయింది. అయినా సంతోషాన్ని దాచిపెట్టి, ముఖం కొంచెం కోపంగా పెట్టి ''అయినా మీతో ఎవరు వాదించగలరు?" అంది.

''అలా దారికి రా.... నీ భర్త సబ్‌జడ్జి కావచ్చు గాని, నేను లాయరు గారి భార్యని'' అంది సుందరమ్మ, గర్వంగా భర్త రఘురామయ్యకేసి నవ్వుతూ చూస్తూ.

''నాన్నగారూ! మీరు మాట్లాడరేవిటి? అమ్మ దబాయించేసి కేసు నెగ్గేస్తోంది. సుప్రీంకోర్టువారు మీరు తీర్పు చెప్పాలి'' అన్నాడు రాజు.

''ప్రతి ఇంట్లోనూ ప్రతి నిత్యం తలెత్తే కేసులివి. వీటిని విచారించడానికి సుప్రీంకోర్టుకి తీరిక ఉండదు....చర్చ బాగానే ఉందికానీ పది దాటింది, వెళ్ళి పడుకోండి'' అంటూ కుర్చీలోంచి లేచాడు రఘురామయ్య.

ఆ రాత్రి పడకగదిలో సరోజ రాజుని సాధించింది- "ఏదో విని ఊరుకుంటారనుకుంటే ఇంత తర్జన భర్జన చేశారేవిటి? అందరిలోనూ మీరు నన్ను సమర్థించి అత్తయ్యగారిని నిలదియ్యడం నాకేం బాగోలేదు. అందులో మావయ్యగారిముందు నాకెంత సిగ్గేసిందని?" అంటూ....

రాజు తికమకపడ్డాడు.

తనని సమర్థించినందుకు సరోజ సంతోషిస్తుందనుకున్నాడు. కాని, వ్యవహారం ఇలా ఎదురు తిరుగుతుందని ఊహించలేదు.

సరే.

ఈమారు అమ్మని సమర్థిస్తే సరి- అనుకున్నాడు.

మర్నాడు ప్రొద్దుటే ''సుప్రభాతం పెట్టమ''ని సుందరమ్మ, ''పాప్ మ్యూజిక్ పెడతాన''ని శశి, ''సూర్య నమస్కారాలు చెయ్యరా'' అని రఘురామయ్య, "తాతయ్యా నన్ను చంపకు, నెలసరి పరీక్షలకి చదువుకోనీ'' అని శివుడూ, ఇలా కొంతసేపు క్రిందా మీదా పడ్డాక, కాఫీల టైము అయింది. అప్పటికికాని నిశ్చితంగా తేలలేదు, వంటమనిషి ఇంక ఆ రోజుకి రాదని.

వంటామె రాకపోతే సుందరమ్మకి చేతినిండా పనే.

తొమ్మిదిన్నరకాకుండా శశికి, శివుడికి వేడి అన్నాలు పెట్టి, కేరియర్లలో మధ్యాహ్నానికి మజ్జిగా అన్నం కల్పిపెట్టి కాన్వెంట్లకి పంపాలి.

పది అయ్యేటప్పటికి రాజు కోర్టుకి బయలుదేరుతాడు. ఏదో కూరా పచ్చడీ వేసి పెట్టడానికి వీల్లేదు. రాజుకేవిటి, రఘురామయ్యకేవిటి- పప్పు, పచ్చడీ, రెండు కూరలూ, పులుసూ అన్నీ ఉండవలసిందే. ఈ అయిదు సంబారాల్లోనూ ఏ ఒక్కటి తగ్గినా ఆరోజు విసుర్లూ కసుర్లూ— చెంబులూ కంచాలూ మాట్లాడుతాయి.

పోనీ అని సరోజ ఏమైనా సాయం చేస్తుందా అంటే. ఆవిడగారు లేచేటప్పటికే ఏడు దాటుతుంది. స్నానాదికాలు ముగించుకొని అలంకరణ పూర్తిచేసుకొని మేడ దిగేటప్పటికి తొమ్మిది. పైగా, ఏడు మల్లెపువ్వులెత్తు, సుకుమారం- ఇక అటువంటిది తనకి సాయం ఏం చేస్తుంది?

ఎలాగో కాళ్ళూచేతులూ విరగద్రొక్కుకోవలసిందే!

సుందరమ్మకి పని ఓ పట్టాన తెమలడం లేదు. అప్పుడే ఏడున్నర కావచ్చింది.

"శశీ, నీ కాన్వెంటు టైముకి వంట కావాలి కదమ్మా! కాస్త వంకాయలు తరిగిపెట్టు" అని మంచి మాటలు చెప్పి శశిచేత సుందరమ్మ కూర తరిగించుకుంటోంది. ఆ సమయంలో సరోజ అటు వచ్చింది. వస్తూనే ''శశీ! బాడీ ఎక్సర్

సైజు చేశావా? డాన్స్ క్లాసుకి టైమయింది కదా, వెళ్ళకుండా కూర్చుని కూర తరుగుతున్నావేమిటి?" అంటూ గదమాయించింది

"దాన్ని కేకలెయ్యకు. ఈ పూట వంటావిడ రాలేదు. అన్నీ ఒక్కచేతి మీద జరగాలికదా! అందువల్ల నేనే కాస్త కూర తరిగి పెట్టమన్నాను. పైగా ఆడపిల్ల కదా! వంటపనీ ఇంటిపనీ నేర్చుకోకపోతే రేపొద్దున్న అతగాడిని పస్తులుంచుతుంది. వీళ్ళ కొత్త కాపురంలో రోజూ ఉపోషాలే!'' అంటూ సుందరమ్మ మనవరాలికేసి చూసి ముసిముసి నవ్వులు నవ్వింది. తలవంచుకొని కూర తరుగుతూన్న శశికి బామ్మమాటలు అర్థమూ కాలేదు, ఏదో కొంత అర్థం అయినా పట్టించుకోనూ లేదు. సరోజ మాత్రం అత్తగారి మాటలకు కాస్త చికాకు పడింది.

''అవన్నీ మీ కాలపు కబుర్లు. ఇప్పటి అమ్మాయిలు వంట నేర్చుకోనూ అక్కర్లేదు, వంటింటి కుందేళ్ళలా ఇంట్లోపడి ఉండనూ అక్కర్లేదు. హోటల్ నుంచి కేరియర్ తెచ్చుకుంటారు. వంటవాళ్ళని పెట్టుకుంటారు. ఆ మాటకి వస్తే వంట వచ్చిన మగాడినే పెళ్ళాడతారు.''

ఆ మాటకి సుందరమ్మ ఫకాల్న నవ్వింది.

అత్తగారు నవ్వాక సరోజకి అర్థం అయింది, ఆవేశంలో తను ఎంత అసంబద్ధంమాట అన్నదీను. దాంతో తనుకూడ నవ్వుకొంది. నవ్వుకొని, ''ఎందుకండీ అత్తయ్యగారూ అవన్నీ, పూర్వకాలంలా చాదస్తం మీరూను. వంటావిడ రాకపోతే అన్నం ఒక్కటీ పడేస్తే సరిపోదూ? కూరలూ అవీ హోటల్‌నుంచి తెప్పించుకుందాం. కూరా, పప్పు, పులుసు అన్నీ శాస్త్రోక్తంగా వండాలా?'' అంది.

ఎంత ప్రేమగా చెప్పింది 'కష్టపడకండి అత్తయ్యా' అని? కోడలి ఆప్యాయతకి సుందరమ్మ గుండెలు సంతోషంతో నిండిపోయాయి.

వెంటనే ఆమెకి కోడలి మాటల్లో మరో అర్థం దాగున్నట్లు అనిపించింది: ''నువ్వేం వండక్కర్లేదు. హోటల్స్ ఉన్నాయిలే మాకు'' అనే అర్థంకూడా ఉందా ఆ మాటల్లో?

దాంతో ఆ పూటల్లా సుందరమ్మ ముఖం చిన్నబుచ్చుకునే ఉంది.

అమ్మ అలా ఎందుకుందో అర్థంకాక, బహుశా అత్తాకోడళ్ళలిద్దరూ ఏదో ఘర్షణపడి ఉంటారని ఊహించి, గతంలో భార్య యిచ్చిన సలహా జ్ఞాపకం తెచ్చుకొని, తల్లికి సంతోషం కలిగించే ఉద్దేశంతో మధ్యాహ్నం భోజనాల దగ్గర "హోటల్ వాళ్ళు వంటవాళ్ళు నీలా ఇంత రుచిగా ఎక్కడ వండగలరమ్మా? కాస్త కోడలికి కూడా నేర్పు రుచిగా వండడం" అంటూ రాజు భార్యకేసి కొంటెగా చూశాడు.

సరోజ కోపంతో మూతి త్రిప్పుకుంది కాని, సుందరమ్మ మాత్రం ఆ మాటలకి ఎంతో పొంగిపోయింది ఆ సంతోషంతో "నేర్పడానికి ఇదేమైనా క్లాసు పాఠమా? అలా చదువుకుని ఇలా బి.యే. పేస్ కావచ్చు. కాని, రుచిగా వంట చెయ్యాలంటే దానికెంతో శ్రద్ధ, నేర్పరితనం కావాలి? పాకకళ అని ఇది ఒక కళ. నేర్పితే వచ్చేదికాదు ఎంతో ప్రేమగా వండాలి....మరెంతో చాకచక్యంగా-" ఇలా సుందరమ్మ ఉత్సాహంగా చెప్పేస్తోంది, రాజు ఆసక్తిగా వింటున్నాడు.

సరోజకి కోపం, ఉడుకుమోత్తనం వచ్చేశాయి. "తల్లీ కొడుకులు పొగుడుకుంటే పొగుడుకోండి. మధ్యన మమ్మల్ని హేళన చెయ్యకండి" అంటూ వచ్చే కన్నీటిని ఆపుకుంటూ వెళ్ళిపోయింది. ఆ తర్వాత భార్యని సముదాయించి కోర్టుకి బయలుదేరేటప్పటికి ఓ గంట ఆలస్యం అయింది రాజుకి. అమ్మని సమర్థిస్తే సరోజకి కోపం, సరోజ తరపున మాట్లాడితే అమ్మకి ఆగ్రహం. ఎటు తీర్పు చెబితే ఏం గొడవో? కోర్టులో తను సమర్థంగా జడ్జిమెంట్లు ఇచ్చి అందరిచేతా శహబాష్ అనిపించుకుంటున్నాడు. అత్తాకోడళ్ళ మధ్య రగడ, ఉండుండి తలఎత్తి, ఇంట్లో ఎవరికీ స్థిమితం లేకుండా చేస్తోంది....

ఒక జటిలమైన మహా సమస్యకి పరిష్కారం దొరక్క తల పట్టుకుని కూర్చున్నట్టు విచారంగా కుర్చీలో కూలబడ్డ కొడుకుని చూసి రఘురామయ్య నవ్వుకున్నాడు. నవ్వుకొని ఆ రాత్రి మళ్ళీ హాల్లో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు, మనవలిద్దరూ నిద్రపోయాక....

సీరియస్‌గా కూర్చున్న కొడుకునీ కోడలినీ భార్యనీ చూసి "నేను చెప్పేది మీ ముగ్గురూ జాగ్రత్తగా వినండి" అంటూ మొదలు పెట్టాడు:

"ఒకచోట ఉండడంవల్ల ఏదో ఒక అభిప్రాయభేదం రావడం సహజం. అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్ళూ, తండ్రీకొడుకులూ, తల్లీకూతుళ్ళ మధ్యనే వస్తుంది. అటువంటప్పుడు అత్తాకోడళ్ళ మధ్య చిన్నచిన్న పొరపొచ్చాలు రావడం విశేషం కాదు. ఇద్దరూ చెరోచోటా పెరిగిన వాళ్ళు కనుక అలవాట్లలో తేడా ఉండొచ్చు. ఆలోచనల్లో భేదం వుండొచ్చు. అందువల్ల ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకుంటే సమస్య ఏం ఉండదు. 'అది చిన్నపిల్ల, ఒకరి ఇంటి దగ్గర్నుంచి మనింటికి వచ్చింది. మన అమ్మాయిలాంటిదే దాని ఇష్టప్రకారమే పోనిద్దాం. పైగా, నా ఆలోచనలు పాత తరానికి సంబంధించినవి. ఇప్పుడు తరం మారింది కదా! కొత్త పద్ధతులకి అనుగుణంగా సర్దుకుపోదాం' అని అత్తగారు అనుకోవాలి. 'ఆవిడ పెద్దది, అనుభవజ్ఞురాలు, అమ్మలాంటిది. అందరి క్షేమం కోరేది, అనురాగం అప్యాయతా గుండెలనిండా ఉన్నది. ఆమెకి ఎలా ఇష్టమో అలాగే కానిద్దాం' అని కోడలు ఓ నిర్ణయానికి రావాలి. ఇలా చేస్తే కోపతాపాలూ గడబిడలూ ఉండవు. అన్నింటికంటే ముఖ్యం పిల్లలు. పిల్లలు మనల్ని చూసి నేర్చుకుంటారు. మనకోసం కాకపోయినా వాళ్ళకోసమైనా సామరస్యంగా ఉండడం అవసరం. అందువల్ల మీ ఇద్దరూ సర్దుబాటు మనస్తత్వం పెంచుకోండి. ఒరేయ్ రాజూ! నువ్వు మీ అమ్మని సమర్థించకు, నీ భార్యని సమర్థించకు. వాళ్ళల్లో వాళ్ళే సర్దుకుంటారు. ఇలా ఉండడం మంచిదని నా అభిప్రాయం." పెద్ద పొదు గాటి జడ్జిమెంట్ చదివినట్లు చదివారు రఘురామయ్య.

"నాన్నగారు లాయర్ అయినా, నాకంటే బాగానే జడ్జిమెంట్ ఇచ్చారు" అనుకున్నాడు రాజు.

"అవునుసుమా! ఇద్దరం ఇంట్లో గడియారంలో ముల్లుల్లా కలిసిమెలిసి తిరగాలి. అప్పుడే అందమూ ఆనందమూనూ'' అనుకున్నారు అత్తాకోడళ్ళిద్దరూ, రఘురామయ్య ఇచ్చిన జడ్జిమెంట్‌ని మరల మరల మననం చేసుకుంటూ. *

(వనిత - '86 దీపావళి సంచిక)